TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 124 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.28.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## కాంగ్రెస్‌కు భారీ షాక్.. బీఆర్ఎస్ గూటికి కీలక నేతలు



నర్సాపూర్: అమృత్ తెలంగాణ: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని కాంక్షిస్తూ నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక కాంగ్రెస్ నాయకులు గులాబీ గూటికి చేరారు. స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అంజనేయులు (మాజీ ZPTC), శరత్ చంద్ర, మల్లేశం, నర్సింహారెడ్డి, అరవింద్ బాబు, ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ: కాంగ్రెస్ అంటేనే 'నయవంచన' అని, ప్రతి వర్గాన్ని మోసం చేసిన చరిత్ర ఆ పార్టీదని ఆరోపించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, ఏ ఒక్కరికీ మేలు జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, నేడు కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో పయనిస్తోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు కేవలం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికేనని ఆరోపించారు. వృద్ధులకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, విద్యార్థులకు విద్యా భరోసా, నిరుద్యోగులకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీలు.. ఇలా అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో "కరెంటు నుండి కాంటా దాకా" రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లోవోల్టేజీతో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కొనుగోలు కేంద్రాలు సక్రమంగా లేక, ధాన్యం దళారుల పాలవుతోందని మండిపడ్డారు. రైతుబంధు, రుణమాఫీ, పంటల బీమా, బోనస్ వంటి పథకాలన్నీ అటకెక్కాయని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మళ్ళీ ఎగిరేది గులాబీ జెండాయేనని, కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ అందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని హరీష్ రావు గారు పిలుపునిచ్చారు.

## పాలసీ పెరాలసిస్ ఉండొద్దు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ మేరకు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. అది వాస్తవిక దృక్పథాన్ని ప్రతిబింబించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించాలని కోరారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా వాటిని విభజించాలని దిశా నిర్దేశం చేశారు. వీటితోపాటు రాష్ట్రాభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్–2047 పాలసీ డాక్యుమెంట్'ను రూపొందించాలని ఆదేశించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను పాలసీ డాక్యుమెంట్‌లో పొందుపరచాలని కోరారు.

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025' పై గురువారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అజహరుద్దీన్, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్–2047కు ప్రభుత్వం సిద్ధమవుతోందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే లక్ష్యంగా రానున్న 22 ఏండ్లకు ఈ భవిష్యత్ కార్యాచరణ ఉండబోతోందని తెలిపారు. డిసెంబరు 8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్ర భవిష్యత్‌ను కొత్త పుంతలు తొక్కించబోతున్నామని వివరించారు.

ఆ సందర్భంగా తెలంగాణలో ఉన్న అపారమైన పెట్టుబడుల అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచబోతున్నామని సీఎం తెలిపారు. తద్వారా ఇక్కడ పెట్టుబడులు పెట్టటం వల్ల కలిగే ప్రయోజనాలపై రెండు రోజులపాటు విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. అందుకే ఆ కార్యక్రమానికి భవిష్యత్ వేదికను కూడా ఫోర్త్ సిటీలోనే ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించి, వివిధ రూపాల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రైజింగ్ విజన్–2047 డాక్యుమెంట్ దార్శనిక భవిష్యత్ పత్రమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుకు అది సమగ్ర రూపమని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ఈ డాక్యుమెంట్‌ను తయారు చేయబోతున్నామని అన్నారు. సమాన వృద్ధి, మహిళా సాధికారత, యువశక్తి, స్థిరమైన అభివృద్ధి.. ఇలా ఈ మూడు ప్రధాన రంగాలపై వ్యూహాన్ని రూపొందించబోతున్నామని విశదీకరించారు.

తెలంగాణను భారత దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడం తమ విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని సీఎం తెలిపారు. చిన్న రాష్ట్రమైనా ఇక్కడ ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి తెలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో కాదు చైనా, జపాన్‌లతోనే పోటీ పడే లక్ష్యాలతో తెలంగాణ దూసుకుపోతోందని అన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌లు, టూరిజం, ఎగుమతుల్లాంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలకమని సీఎం తెలిపారు. తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభ అనుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు రాష్ట్రాన్ని పెట్టుబడిదారులకు మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయని వివరించారు. ఈ బలాలే పునాదిగా, మరిని పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండబోతోందని సీఎం తెలిపారు.

హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణ%ా% ఇలా మూడు జోన్లుగా మార్చి, సమతుల్యాభి వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఎం చెప్పారు. అదే సమయంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనీ, ఆ మేరకు వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్‌లో భాగం కాబోతోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళా సాధికారత కూడా అత్యంత ప్రధానమైన అంశమని వివరించారు. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. డెవలప్‌మెంట్ ఎకానమీలో కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై కూడా దృష్టి సారిస్తామని తెలిపారు. అందుకే 'నెట్–జీరో' తెలంగాణను ఆవిష్కరించబోతున్నామని చెప్పారు. బ్లూ అండ్ గ్రీన్ హైదరాబాద్ లక్ష్యంగా తెలంగాణ–2047 డాక్యుమెంట్‌లో మూసీ పునరుజ్జీవం, అందులో భాగంగా 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

అదే సమయంలో గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో విలేజ్ 2.0 లక్ష్యంతో పని చేయనున్నామని వివరించారు. ఇక మరో లక్ష్యంగా ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో తెలంగాణకు మణిహారంలా రీజనల్ రింగ్ రోడ్డును ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. హై–స్పీడ్ మొబిలిటీ కారిడార్లను ప్రభుత్వం నిర్మించనుంది. రీజనల్ రింగ్ రైల్, నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లను నిర్మించనుంది. వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతోందని వివరించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమయమిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బీసీలకు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. తొమ్మిదో షెడ్యూల్ చేర్చేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని చెప్పారు. తెలంగాణకు చెందిన ఎంపీలు పార్లమెంటు సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చకు తేవాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బీసీల రిజర్వేషన్ అంశంపై పార్లమెంటు సమావేశాల్లో నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదంటే ప్రశ్నోత్తరాల్లో చర్చకు తేవాలని కోరారు.

ప్రధానమంత్రిని కలిసి అన్ని పార్టీల ఎంపీలూ వినతి పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. బీసీల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందనీ, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని చెప్పారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఎంపీలందరూ పార్టీలకతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని అన్నారు. ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాల్లో లేదా గంటల్లో అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామనీ, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జీఎస్టీ తదితర విషయాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలకు గురించి గతంలో లేఖలు రాశామని గుర్తు చేశారు. అవి ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయనీ, వాటి ఆధారంగా ఎంపీలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి విజన్ డాక్యుమెంట్

వచ్చేనెల తొమ్మిదో తేదీ నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి విజన్ డాక్యుమెంట్–2047 ఆవిష్కరించబోతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖులను దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనకు అవసరమైన వనరులు, ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామనీ, కేంద్ర మంత్రులు, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎంపీలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపీలు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇస్తే వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని చెప్పారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖల ద్వారా 47 అంశాలను గుర్తించామని అన్నారు. సెమీ కండక్టర్లకు సంబంధించిన అంశం కూడా చర్చించామన్నారు.




ప్రధానిని సమిష్టిగా కలుద్దాం : ఎంపీ రఘునందన్‌రావు

రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్‌లు, ఇతర సమస్యలపై ప్రధానమంత్రి మోడీ సమయం తీసుకుని సమిష్టిగా కలుద్దామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ క్యాడర్ కేటాయింపు గురించి పూర్తి సమాచారాన్ని ఇస్తే సంబంధిత మంత్రిని పార్టీలకతీతంగా కలసి లేఖ ఇద్దామని ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్దామని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన బొగ్గు గనుల విషయంలో అందరం కలిసి ఆ శాఖ మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టంలో పని దినాలు బాగా తగ్గుతున్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ చెప్పారు. దీంతో పేదలకు ఉపాధి లేకుండా పోవడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, బీజేపీ ఎంపీ నగేశ్, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రాష్ట్రాల్లో ఈగల్ మెరుపుదాడులు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ఈగల్ టీం వ్యూహాత్మకంగా ఆరు రాష్ట్రాల్లో మాదక పదార్థాలు, సైబర్ నేరస్థుల అడ్డాలపై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పెద్ద ఎత్తున డ్రగ్స్‌తో పాటు సైబర్ నేరస్థులు ఉపయోగించే పరికరా లతో పాటు భారీ ఎత్తున నగదును కూడా స్వాధీనపర్చుకుంది. 50 మందికి పైగా డ్రగ్, సైబర్ నేరస్థులను అరెస్ట్ చేసింది. ఈగల్ టీం వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల దొరికిన డ్రగ్ మాఫియా ద్వారా సమాచారాన్ని సేకరించిన ఈగల్ టీం అధికారులు వివిధ రాష్ట్రాల్లో ఉన్న డ్రగ్, సైబర్ క్రైమ్ మాఫియా అడ్డాలపై దాడులకు వ్యూహరచన చేసింది. ఇందుకోసం రెండు వందల మందికి పైగా ఈగల్ టీం అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేసింది. ఈగల్ విభాగం డైరెక్టర్ జనరల్ సందీప్ శాండిల్య, ఇతర ఎస్పీల స్వీయ పర్యవేక్షణలో ఈగల్ టీం ప్రత్యేక బృందాలు గురువారం దాడులకు ఉపక్రమించాయి. ముఖ్యంగా ఢిల్లీ, నోయిడా, గ్వాలియర్, వైజాగ్, హాఫీజాబాద్‌లలోని డ్రగ్, సైబర్ నేరస్థుల అడ్డాలపై ఈగల్ టీం బృందాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడులకు ఢిల్లీ, నోయిడా, గ్వాలియర్, వైజాగ్‌లకు చెందిన స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది సాయం కూడా ఈగల్ టీం తీసుకున్నది.

ఈ దాడుల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో నైజీరియన్ డ్రగ్స్ మాఫియా ఎదురు దాడులకు పాల్పడింది. దీంతో ఈగల్ టీం బృందాలు వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించాయి. అంతేగాక డ్రగ్, సైబర్ నేరస్థుల అడ్డాల నుంచి పెద్ద ఎత్తున మాదకపదార్థాలతో పాటు సైబర్ నేరాలకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సైబర్ నేరస్థులు సేకరించిన వందలాది ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్లను కూడా అధికారులు స్వాధీనపర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రగ్ మాఫియా, సైబర్ నేరస్థులు వాడుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి ఈగల్ టీం అధికారులే విస్మయం చెందారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి భారీ మొత్తంలో నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తమ్మీద ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో 50 మందికి పైగా నైజీరియన్లను అరెస్ట్ చేసిన అధికారులు వారిని హైదరాబాద్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు అవసరమైన న్యాయపరమైన చర్యలను ఆయా రాష్ట్రాల్లో పూర్తి చేస్తున్నారు.

## గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధానికి ఆహ్వానం




హైదరాబాద్ అమృత్ తెలంగాణ: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఆహ్వానించనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారు లతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌కు వచ్చే అతిథులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయా లని ఆదేశించారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని వారికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు 2,600 మందిని ఆహ్వానించినట్టు అధికారులు ఈ సందర్భం గా సీఎంకు వివరించారు.

సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విభాగాల స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మిట్‌లో స్టాళ్ల ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను సీఎంకు అధికారులు వివరించారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఒక్కో ఈవెంట్‌కు సీనియర్ ఐఏఎస్ అధికారికి బాధ్యత అప్పగించాలన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. పోలింగ్ బూతులు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ వరకు ప్రతి అంశం మండలవారీగా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు శాఖతో సమన్వయం పెంచి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, ఎలాంటి ఉల్లంఘనలు గమనించినా వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు తప్పనిసరిగా ఎంసిఎంసి అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామ పంచాయతీలకు సంబంధించిన మొదటి విడత ఎన్నికల కోసం 1408 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 20 శాతం రిజర్వులతో కలిపి మొత్తం 1478 మంది పీఓలు, 1729 మంది ఏపీఓలను నియమించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 4,49,981 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 2,19,652, మహిళలు 2,30,313, ఇతరులు 16 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికల సమయంలో ఎఫ్ఎస్‌టీలూ, ఎస్ఎస్‌టీలూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని చెప్పారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, డీపీఆర్వో విష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో ప్రెస్ మీట్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, డీపీఆర్వో విష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు, తదితరులు.

## జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ప్రజాస్వామ్య పండుగలా జరిగే ఈ ఎన్నికలను విజయవంతం చేయడం అందరి బాధ్యతగా కలెక్టర్ పేర్కొన్నారు. నేటి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు దశల్లో 20 మండలాల్లో జరగనున్నాయని తెలిపారు. ఎంసీసీ అమలు కోసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనుమతుల మంజూరు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎం సి సి ఉల్లంఘనపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం పంపిణీ, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా వ్యవస్థ బలోపేతం, గ్రామ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. నామినేషన్ల నుంచి లెక్కింపువరకు ప్రతి దశలో పారదర్శక విధానాలు అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని పార్టీ నాయకులూ సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ విలువను కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలన, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేస్తే పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా పూర్తవుతాయని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఎఫ్ఎస్‌టి - ఎస్ఎస్‌టి బృందాలతో కలెక్టర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమీక్షలు నిర్వహించారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని అన్నారు. ఎన్నికల ప్రచార పత్రాల్లో ప్రింటింగ్ ప్రెస్ వివరాలు తప్పనిసరిగా ఉండాలని, ప్రెస్ యజమానులకు సూచించారు. FST-SST బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేసి, ఉల్లంఘనలు గమనించిన వెంటనే నివేదించాలని ఆదేశించారు. ప్రజలు 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకవెళ్తే తప్పనిసరిగా రసీదులు, డాక్యుమెంట్లతోనే ఉండాలని స్పష్టం చేశారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టబోయే గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన భద్రతా బందోబస్తు ఇప్పటికే సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకునేలా పోలీసు విభాగం సన్నద్ధమైందన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కలిసి FST వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, FST-SST బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా ఎన్నికల పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం.



అమృత తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పరిశీలకు మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఒ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు పరిశీలకులుగా నియమించబడి, జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయేషా మస్రత్ ఖాన్ ను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఉదయం అటవీ శాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్, అబ్జర్వర్ కు పూల మొక్కను అందించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై ఇరువురు చర్చించారు. పరిశీలకులను కలిసిన వారిలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# గ్రామపంచాయతీ ఎన్నికలకు పోలీస్ శాఖ పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ చేపట్టాలి
ప్రజలు పోలీసులు ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి.
సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేసి కట్టడి చేయాలి.
గ్రామాలను సందర్శిస్తూ ఎన్నికల నియమావళి పై అవగాహన కల్పించాలి.
సమస్యాత్మక ప్రాంతాలు, సమాచార వ్యవస్థ లేని షాడో ప్రాంతాలను గుర్తించాలి.
ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష మరియు నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహణ.
గ్రామపంచాయతీ ఎన్నికలకు పూర్తిగా సంసిద్ధమైన జిల్లా పోలీసు శాఖ.
50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సరైన పత్రాలు కలిగి ఉండాలి.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ పూర్తి సంసిద్ధమై ఉన్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు అనుసరించాలని సూచించారు. ఎన్నికలలో ప్రభావితం చేసే, ఎన్నికలలో సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. గ్రామాలలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎన్నికల రోజు ప్రత్యేకంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఎలాంటి సమాచార వ్యవస్థ సాధ్యం గాని ప్రదేశాలలో షాడో జోన్ లలో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా విహెచ్ఎఫ్ సెట్లను వినియోగించాలని సూచించారు. అత్యధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీల నందు బైక్ పెట్రోలింగ్ ద్వారా గస్తీ నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎస్ ఎస్ టి మరియు ఎఫ్ ఎస్ టి బృందాలను నెలకొల్పినట్టు ఎలాంటి సమాచారం ఉన్న వారికి తెలియజేయాలని తెలిపారు. 50 వేల కంటే ఎక్కువగా నగదు తరలించే సమయంలో సరైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాలను కలిసి ఉండేలా రూట్ మొబైల్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. 100 మీటర్ల లోపు 20 మీటర్ల లోపు ఉన్న నియమ నిబంధనలు పాటించేలా, ఎలాంటి ర్యాలీలు సభలు ఉన్న అనుమతులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. ప్రజలకు నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణ జరిగేలా పట్టిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.


నెలవారి నేర సమీక్ష సమావేశంలో

బేసిక్ పోలీసింగ్ మరియు విజిబుల్ పోలింగ్ ప్రతి ఒక్కరు నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయాలని, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా అరికట్టాలని తెలిపారు. పట్టణంలో బీట్ సిస్టం సక్రమంగా అమలు చేయాలని, దీని ద్వారా నేరాల నియంత్రణ దొంగతనాల నివారణ, సాధ్యమవుతుందని తెలిపారు. రౌడీ షీటర్లను సస్పెక్ట్ షీటర్లను తనిఖీ చేస్తూ ఉండాలి అన్నారు. వర్టికల్స్ బాధ్యత ప్రతి ఒక్కరికి కేటాయించి వాటిని సక్రమంగా నిర్వహించాలన్నారు. కేసుల నందు శిక్షణ శాతం పెరిగేలా పరిశోధన దర్యాప్తు జరగాలన్నారు. జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాలు లేకుండా అరికట్టాలన్నారు. సిబ్బంది నీతి,నిజాయితీ విధుల నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం సమాజంలో సమస్యలు సృష్టించే వారిని దౌర్జన్యాలు దోపిడీలు చేసేవారిపట్ల రౌడీ షీటర్ ఏర్పాటు చేయాలన్నారు. విడిసి ఆధిపత్యాన్ని కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలి. నేర సమీక్ష సమావేశంలో భాగంగా కేసుల నిర్వహణ, దర్యాప్తు, పరిశోధన, ప్రస్తుత స్థితిగతులపై పూర్తి గా తనిఖీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు కాజల్ సింగ్ ఐపీఎస్, బి సురేందర్ రావు, ఎఎస్పి పి మౌనిక ఐపిఎస్, డిఎస్పి లు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్,జిల్లా సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ హెచ్ ఓ లు, కమ్యూనికేషన్, డిసిఆర్బి, ఎన్ఐబి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోయపంట కొనుగోలు జాప్యంపై వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి..

### కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడంతోనే రైతులకు ఇబ్బందులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు........

నిర్మల్ జిల్లా బైంసా నవంబర్ 27 అమృత్ తెలంగాణ సోయపంట పండించిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,తో చరవాణిలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, మాట్లాడటం జరిగింది వారికి గత పది రోజుల నుండి సోయపంట అమ్మకంలో రైతులు ఎదుర్కొంటున్న బాధల గురించి చెప్పటం జరిగింది, కొనుగోలు సెంటర్ వారు పంపిన సోయా బ్యాగులను తిరిగి వాపస్ పంపడం వలన రైతులు నష్టపోతున్నారు. నా పేడ్ సిబ్బంది కూడా సెంటర్లో వచ్చి కొద్దిగా తేడా ఉన్న మొత్తం రిజెక్ట్ చేస్తున్నారని లారీలు కూడా వస్తలేవు అని చెప్పటం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ మేము కూడా కేంద్ర ప్రభుత్వంతో ప్రతిరోజు మాట్లాడడం జరుగుతున్నది లెటర్లు కూడా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి రాయడం జరిగింది కానీ ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి జవాబు రాలేదు. అయినా రెండు రోజులలో ఏదో ఒక నిర్ణయం తప్పకుండా తీసుకుంటామని మంత్రి చెప్పటం జరిగింది



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో రైతుల సమస్యపై ఫోన్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

# స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

## అక్రమ రవాణాకు చెక్ జిల్లా వ్యాప్తంగా 12 చెక్ పోస్టుల ఏర్పాటు

## "నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు" - ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరిక







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు విస్తృత భద్రతా చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో, జిల్లా వ్యాప్తంగా 8 ఇంటర్‌స్టేట్ చెక్ పోస్టులు, 4 ఇంటర్-డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు మొత్తంగా 12 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మద్యం సరఫరా, డబ్బుల పంపిణీ, మరియు ఇతర ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన చర్యలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

12 చెక్ పోస్టుల వివరాలు:

ఇంటర్‌స్టేట్ చెక్ పోస్టులు

సారంగాపూర్ - రామ్‌సింగ్ తాండా చెక్ పోస్ట్

కుబీర్ మండలం - మూడు చెక్ పోస్టులు:

సిర్పెల్లి హెచ్ చెక్ పోస్ట్

సేవాలాల్ తాండా చెక్ పోస్ట్

డోడర్న తాండా చెక్ పోస్ట్

కుంటాల - దౌనెల్లీ తాండా చెక్ పోస్ట్

తానూరు - రెండు చెక్ పోస్టులు:

బెల్ తరోడ చెక్ పోస్ట్

జవుల - బి చెక్ పోస్ట్

బాసర - రెండు చెక్ పోస్టులు:

బిద్రెల్లి చెక్ పోస్ట్

ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు

బాసర - గోదావరి బ్రిడ్జి చెక్ పోస్ట్

ఖానాపూర్ - బాదనకుర్తి చెక్ పోస్ట్

కడెం - పాండవపూర్ చెక్ పోస్ట్

సోన్ - గంజాల్ టోల్ ప్లాజా చెక్ పోస్ట్

ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని నియమించినట్టు ఎస్పీ తెలిపారు. 24 గంటలు, షిఫ్ట్‌ల వారీగా వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అక్రమంగా తరలించే నగదు, మద్యం, ఆయుధాలు మరియు ఇతర ప్రలోభకర వస్తువులను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలు మోహరించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అనుచిత చర్యలకు తావివ్వకుండా పర్యవేక్షణను బలోపేతం చేసినట్టు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యటనలు, రాత్రి గస్తీలు పెంచినట్టు ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# సాయిరాం కాలనీ అంగన్వాడీ సెంటర్లో శ్రీమంతం. అన్నప్రాసనకార్యక్రమం.

అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 27: మెట్ పల్లి పట్టణంలోని సాయిరాం కాలనీ అంగన్వాడి కేంద్రం నందు సీమంతము అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణి రెడ్డి అర్బన్ పిహెచ్సిసి మెడికల్ ఆఫీసర్ కు సీమంతం కార్యక్రమం నిర్వహించడం జరిగింది చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు ఒక వైద్యాధికారిగా ఉండి అంగన్వాడీ సేవలు ఉపయోగించుకుంటూ నలుగురికి ఆదర్శంగా నిలవడం చాలా స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ అంగన్వాడి టీచర్ అమృత,అనురాధ,ఆయా సుజాత, ఇంకా



ఏఎన్ఎం ఆశా వర్కర్స్ తల్లులు పిల్లలు పాల్గొనడం పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి.

అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 27: మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ఆదేశాలతో మెట్పల్లి పట్టణంలోని దుకాణ యాజమాన్యులకు ఆన్లైన్లో తమ ఫోన్ లో రెన్యువల్ ఫీజు కట్టుకోవడానికి అవగాహన చేయడం జరిగింది కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని దుకాణ యజమానులు లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలని లైసెన్స్ తీసుకున్నవారు రెన్యువల్ ఫీజు చెల్లించాలని లేకుంటే ఆన్లైన్ పెనాల్టీ పెరుకుంటా ఉంటదని ఇది గమనించి లైసెన్స్ ఫీజు చెల్లించాలని షాపు లైసెన్స్ తీసుకోకుండా షాప్ నడిపించినచో



మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించగలరని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్,సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల మార్గదర్శాలను తూచా తప్పకుండా పాటించాలి. జిల్లా కలెక్టర్: సత్య ప్రసాద్

కోరుట్ల అమృత్ తెలంగాణ నవంబర్ 27: జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జిల్లాలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాలు అలాగే కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని,ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయా లేదా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వరకు ఎన్ని నామినేషన్లు స్వీకరించబడ్డాయి, అలాగే నామినేషన్ల ఫార్ములు ఎంతమంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన పలు సూచనలు అందించారు. నామినేషన్ ప్రక్రియ చట్టబద్ధంగా, ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు మరియు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా



చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు తొలి విడత ఎన్నికల ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. నవంబర్ 30 రోజున వీటి పరిశీలన ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మొదటి విడతలో 7 మండలాల్లోని 122 గ్రామాలు, 1172వార్డుల్లో డిసెంబర్ 11 న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుందని అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి..

వెల్దండ :అమృత్ తెలంగాణ: వెల్దండ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆ గ్రామాలలో అధికారులు ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలలో గురువారం పలువురు నాయకులు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలాలు చేశారు. వెల్దండ మండల కేంద్రంలో బీసీ మహిళా రిజర్వేషన్ లో కాంగ్రెస్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండల నాయకులతో బుధవార్ పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామపంచాయతీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి ఎమ్మెల్యే తో కలిసి సర్పంచ్ అభ్యర్థి యాదమ్మ వెంకటయ్య గౌడ్ అందజేశారు. అలాగే పెద్దాపూర్ ఎస్సీ మహిళా సర్పంచ్ స్థానానికి ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశమల్ల అనూష కృష్ణ , కొట్ర గ్రామానికి చెందిన షాంపూరి సంతోష అల్లాజీ తిమ్మినోని పల్లి నామినేషన్



సెంటర్లు ఎస్సీ మహిళా రిజర్వేశన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలాలు చేశారు. మండలంలో మొదటి రోజు సర్పంచు స్థానాలకు 19 మంది నామినేషన్లు వేయగా 17 వార్డు స్థానాలకు నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు బస్సు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్ , సురేందర్ రెడ్డి ,కృష్ణ ముదిరాజ్ ,రషీద్, ఎర్ర శ్రీను ముదిరాజ్,రమేష్,పురుషోత్తం చారి ,భరత్ తో పాటు పాల్గొన్నారు.

# పల్లెటూళ్ళ సంస్కృతిని నాశనం చేస్తున్న చిట్టీల వ్యవస్థ ..(దందా)

మల్లాపూర్ అమృత్ తెలంగాణ నవంబర్ 27 మల్లాపూర్ మండలంలో పలు (ప్రతి) గ్రామాల్లో కొంతమంది బడాబాబులుగా చెలామణి అవుతూ అనధికారికంగా చిట్టీలు నడుపుతూ పేద ప్రజలను మోసం చేస్తున్నారు . కూతురు పెళ్ళికనో,కొడుకు చదువులకనో,తల్లిదండ్రులు హాస్పిటల్ ఖర్చులకనో ఒకపూట తిని , రెండుపూటల పస్తులుండి రూపాయి రూపాయి కూడబెట్టి ఈ అనధికారికంగా నడిచే చిట్టీలలో జమచేస్తే, ఇవి నడిపే అర్గనైజర్ల చేతిలో మోసపోతున్నామని అమాయకులు వాపోతున్నారు చివరికి కూతురు పెళ్ళికి, కొడుకు చదువులకు,తల్లిదండ్రుల దవాఖానకు డబ్బుఅందక ఎందరో ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిని చాలా చూస్తున్నాము. నిజంగా చిట్టీల దందాలు చేసేవారు నష్టపోతే ఎక్కడ పడితే అక్కడ భూములు ఎలా కొంటారు? రెండు రెండు బంగళాలు ఎలా కడతారంటూ ప్రశ్నిస్తున్నారు.కొందరైతే మోసం చేసిన డబ్బులతో పేద ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను సైతం వదలకుండా తక్కువ ధరలకు కొంటూ,అమ్ముతూ రియల్ ఎస్టేట్ దందా నడుపుతూ ఇంకో దో నంబర్ దందాకు తెరలేపుతున్నారు. అల్ ఖైదా టెర్రరిస్టుల వల్ల ఎంతమంది నష్టపోయారో తెలియదు కానీ,ఈ అనధికారికంగా నడిపే చిట్టీల వల్ల ఎప్పుడో ఒకప్పుడు ప్రతి కుటుంబం, బాధిత కుటుంబమే అని, చిట్టీల దందాలు చేసేవారు అల్ ఖైదా టెర్రరిస్టుల కంటే అధ్వాన్నంగా తయారయ్యారని బాధితులు లబోదిబోమంటున్నారు. కొందరు భాదితులు పోలీసులను ఆశ్రయిస్తే ఎక్కడ మమ్మల్ని అంటారో అనే భయంతో లోలోపల ఎంతకో అంతకు సెటిల్ చేసుకుంటున్నారని వినికిడి.సమాజంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న పోలీసులను ఆశ్రయిస్తే ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని అందరు గ్రహించాలి.





# నియంతల వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూర్ :అమృత్ తెలంగాణ: స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నియోజకవర్గంలో నియంతృత్వంగా వ్యవహరిస్తున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి సుంకరబోయిన నర్సింహ్మ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో ఆయన గురువారం మండల కేంద్రంలోని వైవిఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కొరకు ఏళ్ల తరబడి పార్టీలు మారకుండా క్రమశిక్షణగా పనిచేస్తున్న వారిని పక్కకు పెట్టి తన ఇష్టం వచ్చిన వారికి పంచాయతీ ఎన్నికల్లో టికెట్లు ఇస్తున్నారని విమర్శించారు. ఒక వ్యక్తి చేతిలో మండల పార్టీని పెట్టి నియంతల వ్యవహరిస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేసిన కార్యకర్తలను అవమానాలకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ, మండల, నియోజకవర్గ నాయకుల అభిప్రాయ సేకరణ లేకుండా, పాత కాంగ్రెస్ నాయకులను పక్కకు పెట్టి 22 గ్రామ పంచాయతీలకు తన సొంత సర్పంచ్ అభ్యర్థులను ప్రకటించుకున్నాడని చెప్పారు. టికెట్ల కేటాయింపులో ఎమ్మెల్యే వేముల వీరేశం, అతడి వర్గీయుల నుంచి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పార్టీలు మారకుండా 40 సంత్సరాలు కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారిని పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు అందరినీ కలుపుకొని పోతానని చెప్పి ఎమ్మెల్యే అయ్యాక తమని దూరం పెట్టారన్నారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు కట్టంగూర్‌పై పెత్తనం చేయడం ఎంటని ఆయన ప్రశ్నించారు. పాత కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అద్దెకు వచ్చిన నాయకులను నమ్మవద్దని మండలంలోని 22 గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్లు వేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రెండు సంవత్సరాలు కాళ్లు, చేతులు కట్టేసినట్లు అయినా ఓపికపట్టి వాళ్ల వెంట తిరిగినా ఫలితం లేదని,ఇక వాళ్లకు తనకు సంబంధం లేదన్నారు.

పాత కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ముందుండి గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, నాయకులు ముక్కాముల శేఖర్, మేడి ఇద్దయ్య, గట్టిగొర్ల సత్తయ్య, మేడి విజయ్, మేడిశ్వరమ్మ, చెరుకు రామన్న, కాపుగంటి గోపి, ఊటుకూరు శ్రీను ఉన్నారు.

# చిన్న నీటి వనరుల గణనపై ఎన్యుమేరేటర్లకు శిక్షణ

భువనగిరి కలెక్టరేట్ :అమృత్ తెలంగాణ: 7 వ చిన్న నీటి వనరుల గణన పై గురువారం రోజున తాసిల్దార్ కార్యాలయంలో ఎన్యుమేరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఓ వెంకటరమణ హాజరై, మాట్లాడారు. కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రతి ఐదేళ్లకోసారి చిన్న తరహా నీటి వనరుల గణన 2000 హెక్టార్ల లోపు ఆయకట్టు గల వనరుల గణన చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏడవ చిన్న తరహా సాగునీటి వనరుల గణన స్మార్ట్ఫోన్లో యాప్ ద్వారా పూర్తిగా డిజిటల్ పద్ధతిన నిర్వహించడం జరుగుతుందన్నారు. తాసిల్దార్ ఆఫీసులో జిపిఓ లు డి ఆర్ డి ఓ లో పనిచేస్తున్న టెక్నికల్, అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ఎన్ యు మై రైటర్ గా సర్వే చేస్తున్నారని తెలిపారు. తాసిల్దార్ అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ భరత్, డిప్యూటీ గణాంక అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఏపీవో బాలస్వామి, ఎంపీఎస్ఓ బాల నరసింహ పాల్గొన్నారు.

# ఎలక్షన్ కోడ్ అమలుతో..అక్రమ మద్యం అమ్మకాలపై "గట్టి నిఘా"




ఆమనగల్ :అమృత్ తెలంగాణ: గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా అక్రమ మద్యం అమ్మకాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బద్యానాద్ చౌహాన్ తెలిపారు. గురువారం ఆమనగల్ పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఉన్న ఫామ్ హౌస్, ఫంక్షన్ హాల్స్, రిసార్ట్స్ లలో లిక్కర్ పార్టీలకు అనుమతులు లేవని వివరించారు. తప్పని పరిస్థితుల్లో మద్యం పార్టీలు నిర్వహించాల్సి వస్తే తప్పక అనుమతులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సారా, దాని తయారీకి వినియోగించే బెల్లం, పట్టిక అమ్మినా, వాటిని నిల్వ ఉంచుకున్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆమనగల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పాత కేసుల్లో ఉన్న వాళ్ళందరిని బైండోవర్ చేయడం జరుగుతుందని సీఐ బద్యానాద్ చౌహాన్ పేర్కొన్నారు.

# ముధోల్ లో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



ముధోల్ : అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన ముధోల్ లోని మజీద్ చౌక్ సమీపంలోగల గడ్డమొల్ల రమేష్ అనే వ్యక్తి ఇల్లు గురువారం ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. బాదితుని కథనం ప్రకారం షాట్ సర్క్యూట్ తో మంటలు అంటుకొనిఇంట్లో ఉన్న కిరాణా షాప్ కు సంబంధించిన సామాగ్రి సుమారురెండు లక్షలు, బీరువాలో ఉన్నకొంత నగదు తో పాటు సుమారు రూ 4 లక్షల విలువ గలిగిన బంగారు నగలు మొత్తం ఆరు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందనివాపోయారు. షార్ట్ సర్క్యూట్ వల్ల వ్యాపించిన మంటలను గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే స్పందించి వ్యాపించకుండా ప్రయత్నం చేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

ఇంట్లో ఉన్న సిలిండర్ కు మంటలు వ్యాపించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ముధోల్ ఎస్ఐ బిట్ల పెర్సిస్, ఆర్ఐ నారాయణ రావు పటేల్, జిపిఓ నర్సయ్య లు ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడంతో ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# కట్ట లింగంపేట ఏకగ్రీవానికి పంచాయతీ




చందుర్తి: అమృత్ తెలంగాణ: స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడేస్తాదో అని వేచిచూసిన వారికి కొందరికి అనుకూలం మరి కిందరికి కలసి రాకపోవడంతో వ్యాపారస్తులు వేత్తలు తమకు అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధికి లక్షల రూపాయలు ఇస్తామని ముందస్తుగా గ్రామ ముఖ్యుల తో సమావేశమవుతున్నారు.అదే ఇప్పుడు జరుగుతుంది. కట్ట లింగంపేట పంచాయతీ జనరల్ రావడంతో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ ప్రముఖ వ్యక్తులతో బుధవారం సమావేశం అయినట్లుగా కొందరి ద్వారా తెలిసింది.

పదిలక్షలు గ్రామానికి ఇస్తా?

తమకు అవకాశం ఇస్తే గ్రామానికి పది లక్షల రూపాయలు ఇస్తానని కరీంనగర్ లో ఉంటున్న ఓ వ్యాపారి కట్టలింగంపేటలో మకాం వేసి పలువురితో మంతనాలు జరువుతున్నట్లుగా సమాచారం. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు పైకి పచ్చ జండా ఊపి లోలోపల ఎర్రజెండా ఊపుతున్నారు. అంటే అయిష్టంగానే ఉన్నారని తెలుస్తుంది.


సన్నగిలకుతున్న అధికార ఆశావాహులు

స్థానిక ఎన్నికల్లో ఎప్పటి నుండో పోటీ చేయాలని ఆధికార పార్టీకి చెందిన కొందరు యువ నాయకులు ఎదిరి చూస్తున్న వారికి ఎదురు గాలిగా మారింది. గ్రామంలో స్థానికంగా ఉంటూ ప్రజా సేవలో ఉంటూన్న యువనాయకులకు ఒకేసారి అందుబాటులో లేని వ్యక్తి అనూహ్యంగా తెర పైకి రావడంతో ఆశావాహుల కు ఆశలు సన్నగిల్లుతున్నాయని సమాచారం. దీంతో గతంలో గ్రామ సర్పంచ్ ఎన్నిక ఏక గ్రీవం చేసిన ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడ రాలేదని దీంతో ఓ వ్యక్తి గ్రామానికి డబ్బులు ఇస్తామని హామీ ఇవ్వడం చట్ట విరుద్ధమని తెలువడంతో కొందరు నాయకులు ససేమిరా అన్నట్లుగా తెలిసింది.

# విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

పెద్దవంగర:అమృత్ తెలంగాణ: ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్ టాక్ పోటీ పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ.. ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడుతాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి పోటీతత్వం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు సృజనాత్మకత, శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కాగా ఎడ్యుక్వెస్ట్ టాక్ సీనియర్స్ విభాగంలో జెడ్పీ ఉన్నత పాఠశాల చిట్యాల నుండి విద్యార్థి రాపోలు రవి కీర్తన్, జూనియర్ విభాగంలో దేశెట్టి శరణ్య ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్ ఒలింపియాడ్ సీనియర్స్ విభాగంలో ను రాపోలు రవి కీర్తన్, జూనియర్స్ విభాగంలో జెడ్పీ ఉన్నత పాఠశాల అవుతాపురం విద్యార్థి వరుణ్ నిలిచారు. వీరికి ఎంఈవో ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్ శివకుమార్, డీకే వెంకటేశ్వర్లు, తఖీ పాషా, అంజయ్య, భాస్కర్, రాజలింగం, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రుహాని టాలెంట్ గుర్తించాల్సిందే..!



చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ రుహాని శర్మ. ఆ సినిమాలో స్ట్రాంగ్ ఉమెన్ గా రుహాని నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఒక్క మూవీతోనే యూత్ లో రుహానికి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఆ తర్వాత రుహాని హిట్ సినిమాలో కూడ నటించింది. శైలేశ్ డైరక్షన్ లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన హిట్ మూవీ కూడా అమ్మడి ఖాతాలో మరో హిట్ పడేలా చేసింది. ఆ తర్వాత డర్టీ హరి నూటొక్క జిల్లాల అందగాడు సినిమాల్లో కూడా నటించింది ఈ భామ. ఇక్కడే కాకుండా బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోలో కూడా రుహాని అదరగొట్టేసింది. ప్రస్తుతం ఆగ్రా మీట్ క్యూట్ సినిమాల్లో నటిస్తున్న రుహాని శర్మ గ్లామర్ షో చేయడంలో మాత్రం వెనకడుగు వెయట్లేదు. అమ్మడు చేస్తున్న ఈ షోకి రోజు రోజుకి తన ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. స్కిన్ షోలో నావెల్టీని జోడీస్తూ రుహాని చేస్తున్న ఫోటో షూట్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతున్నారు నెటిజెన్లు. అంతేకాదు లేటెస్ట్ గా ఓ సాంగ్ కి డ్యాన్స్ చేస్తూ వీడియో చేసింది అమ్మడు. ఆ వీడియోని తన ఇన్ స్టా రీల్స్ లో షేర్ చేసింది. ఛాన్స్ దొరికితే ఎలాగోలా ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్న రుహాని శర్మ ప్రయత్నాలు వర్క్ అవుట్ అవుతున్నాయని చెప్పొచ్చు. అందం అభినయం రెండు కలగలిపి ఉన్న రుహానికి ఇంకా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని చెప్పొచ్చు. తనకి ఇచ్చిన పాత్రలో మెప్పిస్తూ వస్తున్న రుహాని శర్మ స్టార్ సినిమా ఛాన్సుల కోసం ఎదురుచూస్తుంది. లేటెస్ట్ ఇన్ స్టా రీల్స్ తో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రుహాని శర్మ.

# ఈ వెయిటింగ్ దేనికోసం అమ్మడు..?




రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మెప్పించిన బ్యూటీ మృణాల్ ఠాకూర్ అంతకుముందు బాలీవుడ్ సీరియల్స్ తో పాటు సినిమాలు కూడా చేసినా రాని క్రేజ్ అమ్మడికి సీతారామం తో వచ్చింది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రల్లో మృణాల్ అదరగొట్టేసింది. టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందని అందరు ఫిక్స్ అయ్యారు. సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమాలో కూడా తన నటనతో ఇంప్రెస్ చేసింది. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సూపర్ ఛాన్స్ కొట్టేసిన శివానీ కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజప్పాయింట్ చేసింది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల మృణాల్ కెరీర్ రిస్క్ లో పడింది. రెండు హిట్లు పడినప్పుడు కాదు ఒక్క ఫ్లాప్ పడగానే బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అందుకే తెలుగులో అమ్మడికి చేతిదాకా వచ్చిన సినిమాలు చేజారిపోయాయి. పోనీ బాలీవుడ్ లో ఏమైనా వరుస ఆఫర్లు ఉన్నాయా అంటే అక్కడ అరకొర అవకాశాలే తప్ప పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు. ఐతే తెలుగులో కొన్ని ఆఫర్లు వస్తున్నా కూడా మృణాల్ వాటిని వెయిటింగ్ లో పెట్టినట్టు తెలుస్తుంది. మరి కెరీర్ అటు ఇటుగా ఉన్నప్పుడు కూడా ఈ వెయిటింగ్ లు గట్రా దేనికన్నది అర్థం కావట్లేదు. ఐతే ఒక ఆఫర్ కి ఓకే చెప్పాక దానికంటే బెటర్ ఆఫర్ వస్తే కష్టం కదా అని మృణాల్ భావిస్తుంది. ఐతే అలా వెయిట్ చేస్తూ ఆఫర్లను హోల్డ్ లో పెడుతూ వస్తే ఇక ఉన్న ఆ ఒక్క ఛాన్స్ కూడా చేజారే అవకాశం ఉంటుంది. కథల విషయంలో నచ్చక వెయిట్ చేయడం మంచి విధానమే కానీ మరీ మృణాల్ ఠాకూర్ ఇలా రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగానే డీలా పడిపోవడం ఆమె ఫ్యాన్స్ ని కన్ ఫ్యూజ్ చేస్తుంది. మృణాల్ మళ్లీ తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ఐతే సినిమాల పరంగా దూరంగా ఉంటున్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటుంది. తప్పకుండా మృణాల్ కి మళ్లీ మంచి అవకాశాలు రావాలని ఆమె ని ఇష్టపడే ఆడియన్స్ కోరుతున్నారు.

# అమ్మకు అచ్చు గుద్దిన అందం హీరోయిన్గా!



కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాధ కుమార్తెలిద్దరు కార్తీక, తులసి ఇద్దరు ఎంట్రీ ఇచ్చారు. కానీ ఇండస్ట్రీలో వాళ్లు సక్సెస్ కాలేదు. కొన్ని సినిమాలు చేసి వెనుదిరిగారు. అలాగే యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య కూడా లాంచ్ అయింది. కానీ ఆమె కూడా నిలదొక్కుకోలేకపోయింది. వివాహం చేసుకుని ఓఇంటిదైంది. కార్తిక కూడా పెళ్లి చేసుకుని స్థిరపడింది. ఇలా కెలికితే కొంత మంది భామల పేర్లు తెరపైకి వస్తాయి. అయితే ఇప్పుడా సెంటిమెంట్ ని బ్రేక్ చేస్తూ ముందకు సాగాల్సిన బాధ్యత ఈ నయ వారసురాళ్లపై ఉంది. సుందర్ .సి-ఖుష్బూలకు ఇద్దరు అందమైన కుమార్తెలు అవంతిక, ఆనందిత ఉన్నారు. అవంతిక అయితే అచ్చంగా అమ్మనే పోలి ఉంటుంది. ఖుష్బూ నోట్లో నుంచి ఊడిపడినట్లే ఉంటుంది. ఇటీవలే ఇద్దరు చదువులు కూడా పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో అవంతిక మ్యాకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. తాజాగా అమ్మడు ఓ ఫోటోషూట్ లో పాల్గొంది. బ్రౌన్ కలర్ బ్లౌజ్ పై షర్ట్ ధరించి నేలపై కూర్చుని కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. కవ్వించే కిల్లర్ లుక్ లో కట్టిపడేసింది. అమ్మడి ఎదపై సొగసైన టాటూ తో వావ్ అనిపించింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



అన్వేషి జైన్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com